క్లుప్తంగా

ఘనంగా బుద్ధుని జయంతి



తాడేపల్లిరూరల్ : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలోని కారుమంచి వెంకట సుబ్బయ్య చౌదరి ఉద్యాన వనంలో గురువారం గౌతమ బుద్ధుని జయంతి కార్యక్రమం నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి, మంగళగిరి పట్టణ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ రైట్ అండ్ యాక్ట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. బుద్ధం శరణం గచ్ఛామి... సంఘం శరణం గచ్ఛామి అనే బుద్ధుని సూక్తిని స్మరిస్తూ ఆయన మార్గాలను అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ చైర్మన్ కారు మంచి రామారావు, సభ్యులు బూసి గోవిందరాజు, గంజి వెంకయ్య, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రామకృష్ణారావు, బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి శివదాసు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సచివాలయంలో గురువారం పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మద్యం, పొగాకు ఉత్పత్తులు వాడేవారు తప్పనిసరిగా ఈ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. తాడేపల్లి ప్రాథమిక కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ గురుకుమార్, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ల పనుల నిమిత్తం నవులూరు గ్రామంలోని మక్కేవారి పేట, గోలివారి తోట, బాపనయ్య నగర్, ఈఎస్ఆర్ గార్డెన్స్, పుట్టరోడ్డు, ఉడా కా లనీ, శిబిరం, బాపూజీ నగర్, టిడ్కో గృహ స ముదాయాల నందు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలనిపేర్కొన్నారు.

క్షయతో లేదిక భయం

- ప్రతిష్టాత్మకంగా వయోజనులకు వ్యాక్సిన్లు
- ఎన్‌సీడీసీడీ జిల్లా వైద్యాధికారి శ్రావణ్‌బాబు



వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న వైద్యాధికారి శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: క్షయ వ్యాధితో ఇక భయపడాల్సిన పనిలేదని ఎన్‌సీడీసీడీ జిల్లా వైద్యాధికారి శ్రావణ్ బాబు అన్నారు. మండలంలోని వేములూరిపాడు, ఫిరంగిపురం, సుదురుపాడు గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో వయోజన బీసీజీ(బాసిల్లస్ కాల్మెట్టీ-గురిన్) టీకాలు వేస్తున్న సిబ్బంది పని తీరును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయంగా 60 ఏళ్లు ఉన్న వయోజనులకు టీకాలు వేయడం ద్వారా సమాజంలో కొత్తగా క్షయవ్యాధి బాధితుల సంఖ్యను తగ్గించే దిశగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి మరణాల తీవ్రత తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు 60ఏళ్లుపైబడిన, షుగర్ వ్యాధి ఉన్నవారికి , ఒకసారి క్షయ సోకిన వారికి, బీఎం 18 కంటే తక్కువ ఉన్నవారు, మందు తాగేవారు, పొగ తాగుతున్న వారు, క్షయసోకి ఉన్నవ్యక్తి వారి దగ్గరి బంధువులు, స్నేహితులకు బీసీజీ టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, వారి అనుమతితో ప్రతి గురువారం టీకాలు వేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. టీకా వేయించుకున్నవారు కొద్ది రోజుల తర్వాత ఆ స్థానంలో బుడిపె లేదా పుండు వంటిది ఏర్పడటాన్ని గమనించవచ్చన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. తగిన జాగ్రత్తలు తీసుకొని టీకాలు వేసేలా చూడాలని సిబ్బందికి చెప్పారు. మండలంలో 3950 మందిని గుర్తించామని నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫరీనా బేగం, ఎస్తేరు రాణి శ్రావణ్‌బాబుకు తెలిపారు.

ముగిసిన లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

తాడేపల్లిరూరల్ : మంగళగిరిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు గురువారంతో అంగరంగ వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రామ కోటిరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా చివరి రోజున ఉదయం 7 గంటలకు నారసింహ మూలమంత్ర హోమం ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస దీక్షితులు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరు గ్రంథాలయాన్ని గుంటూరు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బారత్నమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కథలు చదడం తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతులు వెంటనే పూర్తి చేయండి

తెనాలిఅర్బన్: 32వ వార్డులోని కొడాలి వీరయ్య మున్సిపల్ పార్కులోని మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. గురువారం పార్కును పరిశీలించారు. అక్కడ చేస్తున్న మరమ్మతులపై ఆరా తీశారు. అనంతరం 25వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంచినీటి సరఫరాకు ఎటువంటి అంతరాయలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ రాజు, హార్టికల్చరల్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



తాడేపల్లిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చంగయ్య మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనేక సార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేశామని, కానీ ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలను కార్మికులకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.కమలాకర్, మున్సిపల్ యూనియన్ నాయకులు సీహెచ్. శివపార్వతి, ఎం.నరసింహారావు, సి.స్వామి, వి.అరుణ, ఎం.తిరుపతమ్మ, పి.వెంకటేశ్వర్లు, వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు



వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యేగా మేకతోటి సుచరిత, ఏపీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అఖండ మెజారిటీతో గెలవాలని నిర్మలగిరి పుణ్య క్షేత్రంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తుళ్లూరు మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు తెలిపారు. గోదావరి జిల్లా నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన వీరు ఫాదర్ ద్వారా ప్రత్యేక ప్రార్థనలు చేయించినట్లు తెలిపారు.

జూన్ 4న ప్రకటించే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీకి 150పైగా సీట్లు వస్తాయని, మేకతోటి సుచరిత భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచి తీరటం ఖాయమన్నారు. ఈ ప్రార్థనలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, గంజి మాల కోటేశ్వరరావు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో కృష్ణ కిషోర్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని గుంటూరు చానల్ సమీపంలో ప్రైమ్ గ్రైండర్ సంస్థ నిర్వాహకుడు పి.శ్రీనివాసరావుపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నేత కృష్ణకిషోర్ డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరిలో ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిగువ మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తూ దారి లేకుండా ఉన్నట్లు మ్యాప్‌లో చూపించి ప్రైమ్ గ్రైండర్ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు మోసపూరిత కాగితాలతో అక్రమ కట్టడాలు కట్టి సంస్థలో పెట్టుబడి పెట్టించి, ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ విల్లాలకు పర్మిషన్ లేదని, సీఆర్‌డీఏ వారు రద్దు చేసి నాలుగు సంవత్సరాలు అయ్యిందని చెప్పారు. మంగళగిరి మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు నోటీసులు ఇవ్వడం కూడా జరిగిందని పేర్కొన్నారు. ప్రైమ్ గ్రైండర్ విల్లాస్‌లో ప్లాట్లు కొన్న ప్రజలు అప్రమత్తత అవ్వాలని కిషోర్ కోరారు. మేని ఆంజనేయులు, నక్కా నాగరాజు, కొరగంటి రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవం.. వేణుగోపాలస్వామి కల్యాణం



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకులు

తాడికొండ: తుళ్లూరు గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని వేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి రాజగోపాలాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ రహదారిపై మార్జిన్లు ఏర్పాటు



ఫిరంగిపురం: గుంటూరు -కర్నూలు రాష్ట్ర రహదారిపై ఇటీవల తారు పోసి మరమ్మతులు చేశారు. గురువారం రహదారిపై మార్జిన్లు, ఎడ్జిలైన్, సెంటర్ లైన్‌లను థర్మాప్లాస్ట్ సహాయంతో సిబ్బంది వేస్తున్నారు. కాగా పాఠశాలలు, గ్రామాల్లోని కొన్ని ప్రాంతాల వద్ద జీబ్రా గీతలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గుంటూరు నుంచి నరసరావుపేట వరకు మార్జిన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ అండ్ బీ సిబ్బంది తెలిపారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి, రక్త హీనతను నివారించవచ్చని వైద్యాధికారి శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్ నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 254 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలు, తల్లి పాల ప్రయోజనాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి. ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం మాబు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

- విస్తృతమవుతున్న తెనాలి బ్లడ్ బ్యాంక్ సేవలు
- ప్లేట్‌లెట్స్ సేకరించే యూనిట్‌కు అనుమతులు
- త్వరలో తెనాలి రానున్న పరికరాలు

'ప్రాణం అంతా రక్తంలోనే ఉంది. రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి.', 'నువ్వు ఇచ్చే రక్తం.. మరోకరికి జీవితము-ప్రాణము', 'తల్లి కన్నీరు కాపాడలేని బిడ్డ ప్రాణాన్ని మీ రక్తదానం కాపాడొచ్చు.. రక్తదానం చేయండి అది ఓ ఆశని, ఒకరికి జీవితాన్ని ఇస్తుంది.', ' అన్నదానం ఆకలిని తీర్చుతుంది..రక్తదానం ఒకరికి ప్రాణం నిలబెడుతుంది.' అంటూ ఇలా ఎన్నో వాక్యాలు రక్తదానం చేయమని చెబుతూ.. ఎందరో ప్రాణాలు నిలుపుతున్నాయి. అలా దాతల నుంచి సేకరించి రక్తాన్ని భద్రపరిచి అత్యసరమైన రోగులకు దానిని అందించి సకాలంలో వారి ప్రాణాలు నిలబెడుతోంది తెనాలిలో జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్.



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ వార్డు



ఫ్రీజర్‌లో భద్రపరిచిన బ్లడ్ ప్యాకెట్లు



ప్రత్యేక వాహనంలో రక్తసేకరణ జరుపుతున్న సిబ్బంది

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ సేవలు విస్తృతం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ రక్త సేకరణ, వాటిని పరీక్షించి అవసరమైన రోగులకు పంపిణీ చేయటం వరకు జరుగుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని అప్‌గ్రేడ్ చేయటంతో పాటు దీనిలో రక్తం నుంచి ప్లేట్ లెట్స్, పాకర్ సేల్స్ వంటి వాటిని వేరు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు ఇచ్చింది. దానికి సంబంధించిన పరికరాలు త్వరలో తెనాలి రానున్నాయి. తెనాలి ఏరియా వైద్యశాలలో 1998లో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో రక్త సేకరణ జరపటం... వాటిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు పంపి పరీక్షలు జరిపేవారు. అనంతరం వాటిని తెనాలిలోని జిల్లా వైద్యశాలలోని రోగులకు వాటిని ఉపయోగించేవారు. ఇలా జరుగుతుండగా ఆస్పత్రిని జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి చెంచుపేటలోని నూతన భవనంలోని వైద్యశాలను సుమారు రెండు సంవత్సరాలకు మార్పు చేశారు. జిల్లా వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ కోసం ప్రత్యేక బ్లాక్‌ను కేటాయించారు. అనంతరం అక్కడ రక్త సేకరణ జరిపిందేకు అవసరమైన బెడ్‌లు, కుర్చీలు వంటి వాటిని ఏర్పాటు చేశారు. అలాగే సేకరించిన రక్తాన్ని అక్కడే పరీక్షలు జరిపి వాటిని రోగులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 300 ప్యాకెట్ల బ్లడ్‌ను భద్రపరిచే ఫ్రిజ్‌లు ఉన్నాయి. అలాగే పరీక్షలు జరిపేందుకు అవసరమైన పరికరాలు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఒక స్టాఫ్ నర్సు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిగా ఒక వైద్యురాలిని నియమించారు.

సుమారు 50వేల మందిని ఆదుకున్న బ్లడ్ బ్యాంక్.

తెనాలి బ్లడ్ బ్యాంక్‌లో నెలకు సుమారు 200 ప్యాకెట్ల రక్తాన్ని సేకరిస్తున్నారు. ఏడాదికి సుమారు రెండు వేల ప్యాకెట్లను రోగులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలోని రోగులకు రక్తం అవసరం అయితే వారికి ఉచితంగా ఇస్తారు. ప్రవేట్ వైద్యశాల రోగులకు అయితే ప్యాకెట్‌కు రూ.800 చొప్పున వసూలు చేస్తుంటారు. తెనాలిలో బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50 వేల ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే రక్త సేకరణకు ప్రత్యేక వాహనాన్ని కూడా ప్రభుత్వం తెనాలికి పంపింది. దానిని ఉపయోగించి అనేక గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో బ్లడ్ డోనేషన్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

తెనాలికి ప్లేట్ లెట్‌లు సేకరించే యూనిట్

తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో డెంగ్యూ బాధితులకు అవసరమైన ప్లేట్‌లెట్స్‌ను సేకరించే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించిన పరికరాలు (బ్లడ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ మిషనరీ, ఫ్రిజ్‌లు) త్వరలో తెనాలి రానున్నాయి. సాధారణంగా రక్తంలోఆర్ బీ ఎస్, డబ్ల్యూబీసీ, ప్లేట్‌లెట్స్ వంటి మూడు రకాల కణాలు ఉంటాయి. నూతనంగా జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేయనున్న యూనిట్ వల్ల వాటిని వేరు చేయవచ్చు. ఆర్‌బీఎస్ రక్తహీనత తక్కువగా ఉన్న వారికి ఉపయోగిస్తారు. డబ్ల్యూబీసీ (పాకర్‌సెల్స్) రియాక్షన్ వచ్చిన వారికి దీనిని ఎక్కించటం వల్ల అది తగ్గుతుంది. డెంగ్యూ సోకిన వారికి ప్లేట్ లెట్స్ తగ్గిపోతాయి. అలాంటి వారికి ప్లేట్ లెట్స్‌ను ఎక్కించటం వల్ల త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

రక్తదానంతో ఎంతో ఉపయోగం



తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో అనేక మంది దాతలు రక్తదానం చేస్తున్నారు. ఎవరైన క్యాంప్‌లు ఏర్పాటు చేసి తమకు తెలియజేస్తే అక్కడికి తాము వచ్చి రక్తాన్ని సేకరిస్తాం. అలా సేకరించిన రక్తాన్ని అవసరమైన రోగులకు పంపిణీ చేస్తున్నాం. రక్తదానం చేయటం వల్ల పలువురికి ప్రాణదానం చేసిన వారు అవుతారు. రక్తదానం చేయటం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు. అందరు రక్తదానం చేసేందుకు ముందుకురావాలి.

డాక్టర్ ప్రసన్న, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి, జిల్లా వైద్యశాల, తెనాలి.

అర్జీలను వెంటనే పరిష్కరించండి

తెనాలిఅర్బన్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉద్యోగులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13 వరకు ఎలక్షన్ విధులను ఉద్యోగులందరూ నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటి నుంచి ప్రజ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మేనేజర్ అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాళ్లపాక అన్నమయ్య జయంతి

తెనాలి: పదకవితా పితామహుడు శ్రీ అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలను గురువారం సాయంత్రం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళావేదికలో ఘనంగా నిర్వహించారు. మహతి, శ్రీ రామలింగేశ్వర భక్త సమాజం, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమయ్యకు అర్చన చేశారు. అనంతరం టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, కొండపి వసుంధరలు దేవి లలిత, యశస్విని, తుల్య శ్రీ, తులసి, శర్వాణితో కలిసి అన్నమయ్య కీర్తనలను జనరంజకంగా ఆలపించారు. ఈ సంకీర్తన కార్యక్రమానికి తబలాపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై జి.నాగసాయి (గుంటూరు) వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2010 సంవత్సరం నుంచి అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలు, వర్ధంతి ఉత్సవాలు చేస్తున్నామని తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత విశేషాలు, ఆయన ప్రాభవాన్ని వివరించారు. సురాభతుల కేశవ, అందే బాలచంద్ర మౌళి, కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. ఇబ్రహీంపట్నం బ్రాంచ్ వారి సంజాయిషీ తెలియజేయునది ఏమనగా 1) సయ్యద్ ముస్తాన్ వలి S/o. సయ్యద్ పాపాసాహెబ్, 2) సయ్యద్ మౌలాలి, S/o. సయ్యద్ ముస్తాన్ వలి గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, దుగ్గిరాల మండలం, కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుకొని సయ్యద్ మౌలాలి S/o. ముస్తాన్ వలి గారికి ఋణము మంజూరు చేయదున్నారు. కావున ఈ ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజులలోగా తగు సాక్ష్యాధారాలతో తెలియపరచవలెను. ఎట్టి అభ్యంతరములు రాని యెడల ఈ ఆస్తి నిర్వివాదమైనదిగా భావించి ఋణము మంజూరుచేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు : ఐటమ్ నెం-1 : గుంటూరు జిల్లా జిల్లా, దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, దుగ్గిరాల మండలం, కంఠంరాజు కొండూరు గ్రామ పంచాయితీ నందలి అసెస్మెంట్ నెం. 915, డోర్ నెం. 4-143, డి.నెం. 162-బి3, డాక్యుమెంట్ నెం. 356/2020 లోని చ.గ॥ 90 లనివేశన స్థలానికి హద్దులు. తూర్పు: అర్థల గోపి గారి ఆస్తి హద్దు అ. 4-6ఇం., దక్షిణం : సయ్యద్ మౌలాలి గారి ఆస్తి హద్దు అ. 31-0ఇం., తిరిగి తూర్పు : సయ్యద్ మౌలాలి సదరు ఆస్తికి గల జాయింటు గోడ హద్దు. అ. 40-6ఇం., తిరిగి దక్షిణం : షేక్ నాగుల్‌మీరా గారి ఆస్తి హద్దు అ. 15.0ఇం., పడమర : పంచాయితీ బజారు హద్దు అ. 45.0ఇం., ఉత్తరం : సయ్యద్ బాషా గారి ఆస్తి హద్దు. అ. 45-0ఇం. ఈ హద్దుల మధ్య ఖాళీ నివేశన స్థలము కలదు.

ఐటమ్ నెం. 2: గుంటూరు జిల్లా జిల్లా, దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, దుగ్గిరాల మండలం, కంఠంరాజు కొండూరు గ్రామ పంచాయితీ నందలి అసెస్మెంట్ నెం. 915, డోర్ నెం. 4-143, డాక్యుమెంట్ నెం. 1297/2019 లోని చ.గ॥ 48.4 ల డాబా ఇంటికి హద్దులు. తూర్పు: షేక్ నాగుల్‌మీరా ఖరీదుకు విక్రయించిన ఆస్తి హద్దు లి. 57ఇం., దక్షిణం : షేక్ నాగుల్ మీరా గారి స్థలము హద్దు. లి. 17.5ఇం., పడమర : మాలో 2వ వారి తాలూకు అనగా సయ్యద్ ముస్తాన్‌వలి గారి స్థలము హద్దు. లి. 57ఇం., ఉత్తరం : సయ్యద్ బాబులా గారి ఆస్తి లి. 17.5ఇం. ఈ హద్దుల మధ్య ఆర్.సి.సి. డాబా కలదు.

విజయవాడ, తేది: 23-05-2024
టి.వి.ఎస్. వాసుదేవరావు, అడ్వకేట్, గడియార వారి వీధి, విజయవాడ.9849431432

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సుల్తానాబాద్‌లోని ఓ దుకాణంలో దాని నిర్వాహకుడు తన సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి వెళ్లాడు. దుకాణానికి వెళ్లిన ముగ్గురు యువకులు సెల్‌ఫోన్ అపహరించుకెళ్లారు. కేసు నమోదు చేసి నిందితులను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్టు ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com